సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



బదిలీల వేళ సిఫారసుల గోల

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ఇప్పటికి మూడుసార్లు పొడిగించడంతో ఈ తంతు ఓ ప్రహసనంగా మారింది. - 8లో



తల్లిదండ్రులు దూరం.. భవిత భారం - 8లో

రెక్కాడితే గాని డొక్కాడని పేదరికం. ఇల్లు తప్ప సెంటు భూమి లేదు. అలాంటి కుటుంబంపై దయలేని విధి పగబట్టింది.



ఏకలవ్యలో చదువులెలా!

సదుపాయాలు లేని ఏకలవ్య పాఠశాలల్లో పిల్లలను ఎలా చదివించేదంటూ పలువురు తల్లిదండ్రులు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు గోడు వినిపించారు. - 8లో

న్యూస్‌రీల్

24న పార్వతీపురంలో జాబ్ మేళా

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్ర సమావేశం మందిరంలో ఈ నెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవంతి ఫీడ్స్, అరబిందో ఫార్మా, జీఎంఆర్ రక్షా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలు వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. అవంతి ఫీడ్స్ లిమిటెడ్ వంద మంది ప్రాసెసింగ్ వర్కర్‌లను నియమిస్తుందని, దీనికి కనీస విద్యార్హత ఏమి లేదని, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు ఎర్రవరంలో పనిచేయాల్సి ఉంటుందని, కనీస వేతనం రూ.11,500 చెల్లిస్తారన్నారు. ఆంధ్రా, తెలంగాణాలలో అరబిందో ఫార్మా కంపెనీ 400 అప్రెంటీస్ పోస్టులను భర్తీ చేస్తుందని, దీనికి 35 సంవత్సరాల లోపు వయస్సు గల మెకానికల్ డిప్లమో, బీఎస్సీ (కెమిస్ట్రీలో) ఉత్తీర్ణత, ఉత్తీర్ణులు కాని పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వేతనం రూ.13 వేల నుంచి రూ.16,500 వరకు ఉంటుందన్నారు. జీఎంఆర్ రక్షా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ 40 మంది సెక్యూరిటీ గార్డులను ఎంపిక చేస్తుందన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 166 సెంటీమీటర్ల కనీస ఎత్తువుండి, 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు గల పురుషులు అర్హులని తెలిపారు. వేతనం రూ.14 వేలు చెల్లిస్తారన్నారు. ఆసక్తి గల యువత ఆ రోజు ఉదయం ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా అశుతోష్ శ్రీవాత్సవ



ఇన్‌చార్జి పీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓగా ఐటీడీఏ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక బాధ్యతలు నిర్వర్తించారు. గిరిజనులకు అవసరమైన సేవలందించి వారి సంక్షేమానికి కృషిచేస్తానని అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు.

పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఈ నెల 27న ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై శనివారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. వేడుకలు పర్యావరణ హితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా పర్యాటక, సాంస్కృతిక, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు ఉండాలన్నారు. సవర కళాఖండాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించాలని, అందులో నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఆహార పదార్థాలను తయారు చేయాలని పేర్కొన్నారు. ఆడలి వ్యూ పాయింట్‌కు వాహన రాకపోకలు, పార్కింగ్‌కు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రహదారి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని, ఆడలి వ్యూ పాయింట్ పక్కాగా కనిపించాలని ఆయన సూచించారు. క్యూఆర్ కోడ్ ఒకటి తయారు చేయాలని, తద్వారా ఆడలి వ్యూ పాయింట్ తెలియడంతో పాటు అక్కడ లభించే వసతులకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆడలి వ్యూ పాయింట్‌ను అదేరోజు ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సీతంపేట అడ్వెంచర్ పార్కులో ప్రపంచ పర్యాటక ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల ఇన్‌చార్జి పీఓలు అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్.యశ్వంత్ కుమార్‌రెడ్డి, పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు, సీతంపేట ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జి చినబాబు, గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి అన్నదొర, కార్యనిర్వాహక ఇంజినీర్ సింహాచలం, డీఈఓ జి.పగడాలమ్మ, సమన్వయ అధికారి సతీష్, ఆడలి వ్యూ పాయింట్ ప్రతినిధి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో దృష్టిలోప సమస్యలు పెద్దలను కలవరపెడుతున్నాయి. వృద్ధాప్యంలో అవసరమయ్యే అద్దాలు బాల్యంలోనే కళ్లకు పెట్టుకోవాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానం, స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లను గంటల తరబడి వినియోగించడం వంటివి చిన్నారుల చూపును మందగించేలా చేస్తున్నాయి. చదువుపై ప్రభావం చూపుతూ.. చూసేవారికి 'ఐ'య్యో అనిపిస్తున్నాయి.

ఐయ్యో!



చదువుపై ప్రభావం

పిల్లల్లో దృష్టిలోపాన్ని త్వరగా గుర్తించలేం. వారూ సరిగా చెప్పలేకపోవడం.. తల్లిదండ్రులు తొందరగా గుర్తించకపోవడంతో సమస్య పెద్దదవుతుంది. దృష్టి లోపం వల్ల పిల్లలు చదువుపై దృష్టి సారించలేరు. క్రీడల్లో చురుగ్గా పాల్గొనలేరు. ముఖాలను గుర్తించలేరు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం కష్టమవుతుంది.

- విద్యార్థుల్లో అధికమవుతున్న దృష్టిలోపం
- చిన్నతనం నుంచే కంటి సమస్యలు
- మారుతున్న జీవనశైలి, సెల్‌ఫోన్ల వినియోగమే కారణమంటున్న వైద్యులు
- కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి 25 మందిలో 10 మంది చిన్నారులే..



బాలికలకు నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యుడు (ఫైల్)

సాక్షి, పార్వతీపురం మన్యం: ఒకప్పుడు 60 ఏళ్ల వయస్సు దాటినా.. కంటి అద్దాలతో పనిలేకుండా స్పష్టంగా చూడగలిగేవారు. ఇప్పుడు మారుతున్న జీవన శైలి ప్రభావం అవ్వొచ్చు.. ఆహారపు అలవాట్లు కావొచ్చు.. వంశపారంపర్యంగా వచ్చినదే అయ్యుండొచ్చు.. దృష్టిలోపంతో బాధ పడుతున్న పిల్లల సంఖ్య అధికమవుతుండడం గమనార్హం. ప్రతి 25 మంది కంటి సమస్యలతో బాధ పడుతున్న రోగుల్లో కనీసం 10 మంది పిల్లలే ఉంటున్నారని పార్వతీపురం పట్టణానికి చెందిన ఓ నేత్ర వైద్య నిపుణుడు చెప్పడం.. ఈ సమస్య నేడు ఎంత ఎక్కువగా ఉందో స్పష్టం చేస్తోంది.

పాఠశాలల్లో నేత్ర పరీక్షలు నిర్వహించగా..

అంధత్వ నివారణ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లోనూ పిల్లలకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 203 పాఠశాలల్లో.. 22,547 మంది బాలికలు, 18,154 మంది బాలురకు పరీక్షలు చేశారు. ఇందులో 433 మంది బాలురు, 754 మంది బాలికలు దృష్టిలోపంతో బాధ పడుతున్నట్టు గుర్తించారు. వీరందరికీ త్వరలో ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వనున్నారు. 12 మందికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

కంటి సమస్యలు గుర్తించడం ఎలా?

- దృష్టి సమస్యలతో బాధ పడుతున్న పిల్లలను వారి ప్రవర్తన.. వారు కళ్లను ఎలా ఉపయోగిస్తున్నారో చూడటం ద్వారా సులువుగా గుర్తించవచ్చు.
- ఒక వస్తువును చూసేందుకు ప్రయత్నించినప్పుడు మెల్లగా లేదా ఒక కన్ను మూసుకోవడం
- చదవడానికి గానీ, వీక్షించడానికి గానీ వారి తలను వంచడం
- వస్తువులను వారి కళ్లకు చాలా దగ్గరగా పట్టుకోవడం
- తరచుగా తలనొప్పి, కంటి నొప్పి, దురద వంటి సమస్యలను చెప్పడం
- పాఠశాలల్లో చదవడం, రాయడం విషయంలో చురుగ్గా లేకపోవడం
- తెలిసిన ముఖాలు, వస్తువులను గుర్తించడంలో ఇబ్బంది

సెల్‌ఫోన్లతోనూ ఇబ్బందే..



పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు చూడడం వల్ల కూడా కంటి చూపు మందగించే ప్రమాదం ఉంది. అదే పనిగా మొబైల్ స్క్రీన్‌ను చూడటం వల్ల ఆ ప్రభావం కంటి చూపుతోపాటు.. అనేక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని వైద్యులు చెబుతున్నారు. మరీ పిల్లలు మారం చేస్తే పెద్దల పర్యవేక్షణలో ఏదో ఒక అరగంటపాటు మాత్రమే సెల్‌ఫోన్లు చూడటానికి అనుమతి ఇవ్వాలని సూచిస్తున్నారు.

బాల్యంలో కళ్లు జాగ్రత్త

సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. మనిషి శరీరంలో కళ్లు ఎంతో ముఖ్యమైనవి. బాల్యంలో పిల్లల కళ్లను జాగ్రత్తగా చూడాల్సిన అవసరం ఉందన్నది వైద్యుల మాట.

- ప్రతి రెండు సంవత్సరాలకూ ఒకసారి కంటి పరీక్ష చేయించాలి.
- అనేక సందర్భాల్లో వంశపారంపర్యంగా సమస్యలు వస్తుంటాయి. కుటుంబ కంటి ఆరోగ్య చరిత్రను తెలుసుకోవడం ద్వారానూ పిల్లలను వైద్యులకు ఓ సారి చూపించాలి.
- పిల్లల్లో అంధత్వానికి ప్రధాన కారణం కంటి గాయాలు. పిల్లలు ఆరుబయట ఆడుతున్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పాలి.
- కొన్ని ఇన్‌ఫెక్షన్లను నివారించడానికి తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి.
- పండ్లు, కూరగాయలు, పాలు, ప్రధానంగా ఆకుకూరలు అధికంగా ఉండే ఆహారాన్ని ప్రోత్సహించాలి. జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉంచాలి.
- పిల్లలు అధిక బరువు ఉండకుండా చూడాలి.

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ప్రధానంగా కళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అదేపనిగా సెల్‌ఫోన్లకు, టీవీలకు, కంప్యూటర్లకు అతుక్కుపోకుండా చూడాలి. పెద్దల పర్యవేక్షణలో కాసేపు మాత్రమే వాటిని వినియోగించవచ్చు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేయాలి. కంటికి రక్షణ ఇచ్చే ఆకుకూరలు, కాయగూరలు, పాలు, పండ్లను ఎక్కువగా ఇవ్వాలి. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉంచాలి.

– యాళ్ల వివేక్, ప్రముఖ నేత్ర వైద్యనిపుణులు, పార్వతీపురం

పిల్లలకు వైద్య పరీక్షలు



విద్యార్థి స్థాయి నుంచే దృష్టి లోపం ఉంటే పిల్లల చదువు, మానసిక పరిస్థితిపై ప్రభావం ఉంటుంది. అందుకే పాఠశాలల్లో నేత్ర వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం. సమస్య ఉన్న వారిని గుర్తించి అవసరమైన వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ నగేష్‌రెడ్డి, నేత్ర వైద్యాధికారి

విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు



చిన్నతనంలోనే పిల్లల్లో కంటి సమస్యను గుర్తించి నివారించేందుకు ఆగస్టు 1 నుంచి అన్ని పాఠశాలల్లో నేత్ర వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు చేపట్టిన పరీక్షల్లో 1,187 మంది వరకు విద్యార్థులు దృష్టిలోపంతో బాధ పడుతున్నట్టు గుర్తించాం. వీరికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తాం. అవసరమైన వారికి శస్త్రచికిత్సల కోసం ఆస్పత్రికి తరలిస్తాం.

– డాక్టర్ సుకుమార్ బాబు, జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం మేనేజర్

సూపర్ సిక్స్ మోసకారి చంద్రబాబు

- అధికారం చేపట్టి వంద రోజులైనా అమలుకాని హామీలు
- హామీల అమలును కప్పి పుచ్చుకునేందుకు తిరుపతి లడ్డూపై విషప్రచారం
- అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి



పార్వతీపురంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏనాడూ ఇచ్చిన మాటపై నిలబడిన దాఖలాలు లేవని, సూపర్ సిక్స్ హామీలిచ్చి ప్రజలను మరోసారి మోసం చేశారని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజారాణి ఆరోపించారు. స్థానిక విలేకరులతో ఆమె శనివారం మాట్లాడారు. వంద రోజుల కూటమి పాలన దోపిడీలు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, కుట్రలు, అరాచకాలు, దాడులు, వైఫల్యాలు, రైతులు, మహిళలు, పిల్లలు, నిరుద్యోగులను మోసం చేయడం, నయవంచనతో సాగిందన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పలువురు ఎమ్మెల్యేల తీరు కమిషన్ కొట్టు ఖనిజ సంపదను కొల్లగొట్టు అన్నట్లు ఉందన్నారు. గతంలో జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ మొదటి స్థానంలో ఉందని, ప్రస్తుత కూటమి పాలనలో చివరి స్థానానికి పడిపోయిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పోటీ పడాలని, అవినీతిలో కాదన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాకు పక్క రాష్ట్రం ఒడిశా నుంచి సారాఅక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునేవారే లేరన్నారు.

తిరుపతి లడ్డూపై విషప్రచారం

ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు పథకాలు అటకెక్కాయని, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టి మరల్చేందుకు గత ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలకు కూటమి ప్రభుత్వం తెరలేపిందన్నారు. అత్యంత పవిత్రమైన టీటీడీని భ్రష్టుపట్టించేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హైందవ కార్యక్రమాల్లో కాళ్లకు ఉన్న షూస్ తీయకుండా పాల్గొనే సీఎం చంద్రబాబు హిందువుల మనోభావాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ప్రత్యామ్నాయ పదాలుగా కరువు, దుర్భిక్షం నిలిచిపోయాయన్నారు.

పల్లెల్లో గంజాయి వాసన

- మునుపెన్నడూ లేని విధంగా గంజాయి సంస్కృతి
- ఆంధ్ర, సుంకి నుంచి దిగుమతి
- గంజాయి కిలో రూ.5 వేలు
- ఇటీవల 15 కేజీల గంజాయితో పట్టుబడిన యువకులు
- రోజురోజుకూ పెరుగుతున్న గంజాయి వినియోగం



మెరకముడిదాం మండలంలో ఈ నెల 18న పట్టుబడిన 15 కేజీలు గంజాయితో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ(ఫైల్)

చీపురుపల్లి: ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఇప్పుడు గంజాయి వాసన గుప్పుమంటోంది. ఎక్కడో పెద్ద సిటీల్లో వినియోగించే గంజాయి.. ఇప్పుడు చిన్న చిన్న పల్లెల్లోనూ విక్రయిస్తుండడం, వినియోగించడం కలకలంరేపుతోంది. మునుపెన్నడూ లేని విధంగా చీపురుపల్లి నియోజకవర్గంలోకి గంజాయి సంస్కృతి రావడం, యువత బానిసలుగా మారుతుండడం భయాందోళన కలిగిస్తోంది. కళాశాల విద్యార్థులతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా గంజాయికి అలవాటు పడుతున్నట్టు సమాచారం. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో ప్రస్తుతం ఎక్కడ విన్నా గంజాయి వినియోగంపైనే చర్చ సాగుతోంది. ఇంతవరకు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యాపారం ఇటీవల మెరకముడిదాం మండలంలో ఏకంగా 15 కేజీలు గంజాయితో యువకులు పట్టుబడడంతో ఏ స్థాయిలో గంజాయి రవాణా, వినియోగం వెలుగులోకి వచ్చింది. దీనిపై అప్రమత్తమైన పోలీసులు కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం, రవాణా వల్ల కఠినమైన కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరిస్తున్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

ఆంధ్ర, సుంకి నుంచి గంజాయి రవాణా

ఒడిశా రాష్ట్రంలోని సుంకి నుంచి సాలూరు మీదుగా పాచిపెంట, ఆంధ్ర నుంచి మానాపురం, పోర్ల మీదుగా మెరకముడిదాం, గుర్ల మండలాల్లోకి గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం. ఈ కోవలోనే సుంకి నుంచి ఆటోలో తెస్తున్న 15 కిలోల గంజాయిని ఈ నెల 18న మెరకముడిదాం మండలంలో పోలీసులు పట్టుకున్నారు. గంజాయి కూడా పోలీసులు నిర్వహించే సాధారణ వాహన తనిఖీల్లో పట్టుబడడం గమనార్హం.

గంజాయి కిలో రూ.5 వేలకు విక్రయం

ఇదిలా ఉండగా నియోజకవర్గంలోకి తెస్తున్న గంజాయి కిలో రూ.5 వేలుకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. సుంకిలో కిలో గంజాయి రూ.2,500కు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొచ్చి రూ.5 వేలకు అమ్ముతున్నట్టు సమాచారం. కిలోకు రూ.2,500 లాభం రావడంతో కొందరు గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు భోగట్టా.

ఉపేక్షించేది లేదు



గంజాయి రవాణా చేసినా, వినియోగించినా ఊపేక్షించేది లేదు. సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో గంజాయి రవాణా, వినియోగంపై గట్టి నిఘా ఏర్పాటు చేశాం. ఎలాంటి సమాచారం తెలిసినా తక్షణమే దాడులు నిర్వహిస్తాం. బుధరాయవలస పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 18న 15 కేజీలు గంజాయి పట్టుకుని కేసు నమోదుచేశాం. గంజాయి వినియోగించే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. కేసులు నమోదు చేస్తాం.

– జి.శంకరరావు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, చీపురుపల్లి

పేదల ఇళ్ల నిర్మాణానికి..
ఇసుక కొరత

- ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది మరొకటి
- కూతవేటు దూరంలో ఉన్నా అందని ద్రాక్షలా ఇసుక
- జిల్లాలో గతప్రభుత్వ హయాంలో 27,142 ఇళ్లు మంజూరు
- పూర్తయినవి 13,196
- ప్రస్తుతం ఇసుక లేక ఆగిపోయిన ఇళ్లనిర్మాణాలు 7,162
- జిల్లాలో ఇప్పటి వరకు ప్రారంభం కాని ఇసుక సరఫరా
- పనులు లేక ఇబ్బందులు పడుతున్న భవన నిర్మాణ కార్మికులు



పార్వతీపురం పట్టణం చాకలి బెలగాంలో ఇసుకలేక నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజల సమస్యలకు సకాలంలో పరిష్కారం లభించడం లేదు. సంక్షేమ పథకాలు ఎండమావిగా మారాయి. వంద రోజుల పాలనలో వంద కష్టాలు అన్న మాట ప్రజలనోట వినిపిస్తోంది. విద్యార్థుల చదువుకు అండగా నిలిచే తల్లికివందనం డబ్బులు ఇంతవరకు మంజూరుకాలేదు. రైతన్నకు పెట్టుబడి భరోసా అందలేదు. మత్స్యకారులకు భృతి మాటే ప్రభుత్వం మరిచిపోయింది. సూపర్ సిక్స్ అమలును పక్కనపెట్టేసింది. ఇవన్నీ ఒక ఎత్తైతే భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక జిల్లాలో దొరకడం లేదు. ఫలితం భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలు నిర్మించుకునే ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేది. ఇప్పుడు కొనుగోలు చేద్దామన్నా ఇసుక దొరకడంలేదంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. ఇసుక దొరకక పనులు నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనికరువైంది. ఉపాధి లేక ఆకలికేకలు వినిపిస్తున్నాయి. ఇదెక్కడి పాలన తీరు 'బాబూ' అంటూ నిట్టూర్పుతున్నారు.

ఇసుక లేకపోతే నిర్మించేదెలా?

పేదలు ఇళ్ల నిర్మాణాలు పునఃప్రారంభించి వంద రోజుల్లో పూర్తిచేయాలని అధికారులు నోటీసులు ఇస్తున్నారు. వీటిపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇసుక లేకుండా పనులు ఎలా చేసేదంటూ అధికారులపై మండిపడుతున్నారు. గత ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లాలో 27,142 మంది కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో 13,196 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న 11,079 నిర్మాణాలు మార్చి 2025వ తేదీలోపు కచ్చితంగా పూర్తిచేయాలని ప్రభుత్వం వందరోజుల పథకం తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా 1449 రూఫ్ లెవెల్, 676 రూఫ్ కాస్ట్ పూర్తయిన ఇళ్లను వంద రోజుల్లోపు నిర్మాణం పూర్తి చేయాలని నోటీసులు అందజేశారు. ఇసుక లేకుండా నిర్మాణాలు ఎలా పూర్తిచేస్తామని, ప్రభుత్వమే ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని పేదలు కోరుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

ఇసుక సరఫరాకు కష్టాలు..

పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజకవర్గాలకు సంబంధించి బొబ్బిలి స్టాక్ పాయింట్ నుంచి, పాలకొండ నియోజకవర్గానికి భామిని మండలం కాట్రగెడ్డ రీచ్ నుంచి ఇసుక తెచ్చుకోవాలి. ఇక్కడ నుంచి ఇసుక తీసుకురావడానికి ఒక ట్రాక్టర్‌కు కనీసం రూ.4,900 ఖర్చువుతుంది. అక్కడ కూడా ప్రస్తుతానికి ఇసుక అందుబాటులో లేదు. సమయానికి ఇసుక తీసుకురాలేక, పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

100 రోజుల్లో ఎలా పూర్తి చేస్తాం

ఇసుక లేకుండా ఇంటి నిర్మాణం కష్టం. గత ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. కూలీనాలీ చేసుకుని ఇంటి నిర్మాణం చేపట్టాం. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి ఇసుక దొరకడం లేదు. సచివాలయాల్లో గతంలో కూపన్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇలా అయితే ఇంటి నిర్మాణం వంద రోజుల్లో ఎలా పూర్తి చేస్తాం.

– పాలకొల్లె అనిత, లబ్ధిదారు, పార్వతీపురం

ఇసుక కొరతతో ఉపాధి కరువు

జిల్లా ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం ఇసుక ఉచితం అంటున్నా.. ఎక్కడా దొరకడంలేదు. మేస్త్రి పనిచేసుకుని జీవనం గడుపుతున్న మాకు ఉపాధి కరువైంది. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పనిలేక ఇల్లు గడవడమే కష్టమవుతోంది.

– జి.బాలాజీ, మేస్త్రి, పార్వతీపురం

పనుల్లేక అవస్థలు

ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచిపోయాయి. కూలి పనులు ఉండడంలేదు. వారంవారం వచ్చే కూలి డబ్బులతో ఇంటికి కావాల్సిన సరుకులు కొనితెచ్చుకునే వారం. ఇప్పుడు పనులు లేక అవస్థలు పడుతున్నాం. అప్పు కూడా దొరకడం లేదు.

– టి.లక్ష్మి, భవన నిర్మాణ కార్మికురాలు, పార్వతీపురం

నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

- 64 మందిలో 48 మంది బదిలీలకు అవకాశం
- సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ల బదిలీలు నేటితో పూర్తి
- మంచి స్థానాల కోసం భారీ పైరవీలు

విశాఖ సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు ఈ నెల 22వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ, ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల పరిధి) జోన్‌లో మొత్తం 64 సబ్ రిజిస్ట్రార్లు ఉండగా.. తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందులో 48 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ కానున్నారు. మార్చి నెలలో పదవీ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల జాబితా నుంచి మినహాయించారు. ఇందులో ఆనందపురం, పాలకొండ సబ్ రిజిస్ట్రార్ వచ్చే ఏడాది మార్చిలోగా పదవీ విరమణ చేయనుండటంతో ఈ స్థానాలను మినహాయించారు. ప్రధానంగా మధురవాడ, భీమిలి, సూపర్ బజార్ ఆర్‌వో, ద్వారకానగర్, అనకాపల్లి, విజయనగరం, విజయనగరం వెస్ట్, శ్రీకాకుళం టౌన్‌తో పాటు కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చేందుకు పలువురు సబ్‌రిజిస్ట్రార్లు పైరవీలు చేసుకుంటున్నారు. తాజా మార్గదర్శకాలతో భోగాపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కాస్తా కేటగిరీ-సీలో మారడంతో ఈ స్థానానికి వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అయితే అంతా కౌన్సెలింగ్ ద్వారానే జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నా.. అధికార పార్టీ నేతల ద్వారా పైరవీలతో పాటు భారీ ఎత్తున ముడుపులు సమర్పించుకునే వారికి మంచి పోస్టింగులు దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విశాఖ డీఐజీ బాలకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కౌన్సెలింగ్ టీమ్‌లో విజయనగరం డీఐజీ సభ్యులుగా ఉన్నారు. ప్రధాన కార్యాలయం నుంచి జాయింట్ ఐజీ టి.సరోజ పరిశీలకులుగా వచ్చారు. సబ్ రిజిస్ట్రార్లతో పాటు సీనియర్ అసిస్టెంట్స్, ఆఫీస్ సబార్డినేట్స్ బదిలీలను ఆదివారంతో పూర్తి చేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

కులగణనను వెంటనే చేపట్టాలి

- జీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణ చంద్రరావు

విజయనగరం ఫోర్ట్: కులగణనను ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వెంటనే చేపట్టాలని బహుజన్ సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ డాక్టర్ పూర్ణచంద్ర రావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 2 వేల మంది వరకు ఎమ్మెల్యేలు అయితే బీసీలు కేవలం 498 మంది మాత్రమే ఎమ్మెల్యేలు అయ్యారని అన్నారు. 1207 మంది కమ్మ, రెడ్డి కులాలకు చెందిన వారు ఎమ్మెల్యేలు అయ్యారని పేర్కొన్నారు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారి ప్రాబల్యం కూడా నేడు అసెంబ్లీలో ఒక సీటుకే పరిమితం అయిందన్నారు. రాష్ట్రంలో 243 కులాలు ఉంటే 200 కులాలకు చెందిన వారికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా అవకాశం లభించలేదన్నారు. కులగణన చేపడ తామని టీడీపీ మ్యానిఫెస్టోలో పెట్టిందని, అయినప్పటికీ కులగణన చేపట్టకుండా తాత్సర్యం చేస్తుందన్నారు. అసెంబ్లీలో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, కులగణన చేస్తే కదా రిజర్వేషన్ కల్పించగలరని తెలిపారు. కులగణన చేయకుండా రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. బీసీలకు రక్షణ చట్టం తెస్తామని ఇంతవరకు దాని ఊసే లేదన్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టులు అన్ని బీసీలకే ఇవ్వాలన్నారు. బీసీల ఓట్లుతో గద్దె నెక్కిన చంద్రబాబు హామీలు అమలు చేయకపోతే గద్దె దిగాలన్నారు. సమావేశంలో బీఎస్పీ స్టేట్ కో ఆర్డినేటర్ , మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, బి.పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నదిలో పడి వృద్ధురాలి మృతి

మక్కువ: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన శంబంగి గౌరమ్మ(65) నదిలో పడి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గౌరమ్మ ఈ నెల 9న ఇంటి నుండి పొలం పనుల నిమిత్తం గ్రామ సమీపంలోని గోముఖి నది దాటి పంట పొలానికి వెళ్లింది. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినప్పటికి ఆచూకీ లభించలేదు. అప్పటి నుంచి ఆమెను వెతికే క్రమంలో శనివారం సాయంత్రం దేవరశిర్లాం గ్రామ సమపంలో సువర్ణముఖి నది ఒడ్డున పంప్ హౌస్ వద్ద మృత దేహం కనిపించినట్టు కుటుంంబ సభ్యులు తెలిపారు.

ఇది మంచి 'పార్టీ కార్యక్రమం'



కూటమి వంద రోజుల పాలనపై అట్టహాసంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం విదితమే. ప్రభుత్వపరంగా, అధికారులందరి భాగస్వామ్యంతో గ్రామసభలు, ఇంటింటా ప్రచారం చేపడుతున్నారు. ఇది కాస్త.. అచ్చంగా పార్టీ ప్రచార కార్యక్రమంలా సాగుతోంది. మక్కువ మండలం కోన పంచాయితీ గోపాలపురం గ్రామంలో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం'లో రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. సభా వేదికపై డీఎఫ్‌వో ప్రసూన, ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దారు షేక్ ఇబ్రహీంలే అధికారులపరంగా కనిపించారు. జనసేన, టీడీపీ నాయకులకే వేదిక 'వేదికై ంది.' అటవీ, ఐసీడీఎస్, గృహనిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీరాజ్, ఇతర అధికారులు సభావేదిక కింద నుంచే సమావేశాన్ని తిలకించాల్సి వచ్చింది. ఇద్దరు సర్పంచ్‌లు, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు మినహా మిగిలిన వారందరూ ఏ పదవులూ లేని గ్రామ స్థాయి టీడీపీ నాయకులే వేదికను అలంకరించడం విశేషం. జిల్లా వ్యాప్తంగా ఇదే తరహాలో కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇది ప్రభుత్వ కార్యక్రమమా.. పార్టీ కార్యక్రమమా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

\- సాక్షి, పార్వతీపురం మన్యం

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210





బదిలీల వేళ సిఫారసుల గోల

- నేటితో ముగుస్తున్న ఉద్యోగుల బదిలీలకు గడువు
- పదేపదే గడువు పొడిగింపుతో ఆందోళన
- టీడీపీ ఎమ్మెల్యేల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణలు
- ప్రసన్నం చేసుకున్నవారికే సిఫారసు లేఖలు
- సిఫారసు లేఖలకే అధికారుల ప్రాధాన్యం
- ప్రసన్నం చేసుకోలేనివారికి శంకరమాన్యాలే!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ఇప్పటికి మూడుసార్లు పొడిగించడంతో ఈ తంతు ఓ ప్రహసనంగా మారింది. ఈ నెల 22వ తేదీతో తుది గడువు ముగుస్తుండడంతో తమను ఎక్కడ బదిలీ చేయబోతున్నారోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వారి ఇబ్బందులను, అవసరాలను ఆసరాగా తీసుకొని టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు, నాయకులు రాజకీయం చేస్తున్నారు. పైరవీలతో ఒత్తిళ్లను పెంచడానికే పలుమార్లు గడువు పొడిగించారనే గుసగుసలు ఇప్పటికే ఉద్యోగ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా కోరుకున్న చోటకు వెళ్లాలని కొందరు, ఉన్నచోటే ఉండిపోవాలని మరికొందరు ఉద్యోగులు టీడీపీ కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేశారు. వారి సిఫారసు లేఖలను ఉన్నతాధికారుల ముందు పెట్టారు. ఈ తంతంగంలో స్థానిక టీడీపీ నాయకుల నుంచి ఎమ్మెల్యేలు, మంత్రి పేషీ వరకూ ఎవరూ ఎక్కడా తగ్గలేదని తెలిసింది. అంతే కాదు తమను ప్రసన్నం చేసుకోని ఉద్యోగులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అనుకూలురనే ముద్రవేసి శంకరగిరి మాన్యాలు పట్టించడానికీ వెనుకాడని వైనం ఇప్పుడు ఉద్యోగుల్లో ఆందోళనకు దారితీస్తోంది. తమకు ఎక్కడికి బదిలీ అవుతుందో, తాము కోరుకున్న చోటకు వేరెవరు పోటీ వస్తారో, మ్యూచువల్ బదిలీకి గతంలో అంగీకరించినవారు మళ్లీ ఏమైనా మనసు మార్చుకొని ఎక్కడ ససేమిరా అంటారోనని కలవరపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారు కూడా అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

సిఫారసు లేఖలకే తొలి ప్రాధాన్యత...

బదిలీల ప్రక్రియ గతంలో మాదిరిగా కౌన్సెలింగ్ ద్వారా జరగడం లేదు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకుల సిఫారసు లేఖలకే జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వినికిడి.

షరతులతో సిఫారసులు...

ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రాతిపదికనే బదిలీలకు అవకాశం ఇవ్వడంతో తమ సొంత ప్రాంతాలకు, లేదా సమీప ప్రాంతాలకు వెళ్లాలని ఉద్యోగులు వివిధ మార్గాలు వెతుకుతున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల విభజన తరువాత పలువురు తప్పనిసరి బదిలీపై అప్పుడు వెళ్లాల్సి వచ్చింది. అలాంటివాళ్లు ఈ బదిలీల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది ఎంత ఖర్చయినా పెట్టేందుకు వెనుకాడడం లేదు. ఇదే అదనుగా అధికార పార్టీలో నియోజకవర్గ స్థాయి నేతలతో పాటు వారి వ్యక్తిగత సహాయకులు బాగానే డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ప్రధానంగా రెవెన్యూ, పోలీస్, సబ్ రిజస్ట్రార్ కార్యాలయాల ఉద్యోగుల్లో ఈ తంతు ఎక్కువగా కనిపిస్తోంది. ఈ విభాగాల్లోని జిల్లా, మండల స్థాయి అధికారుల పోస్టులలో ఇప్పటికే అనుకూలులైన అధికారులను అధికార పార్టీ నాయకులు తెచ్చుకున్నారు. అదీ తమకు అనుకూలంగా నడుచుకుంటామన్న షరతులు విధించిన తర్వాత పోస్టింగ్ ఇప్పించారని తెలిసింది. ఇక తమకు నచ్చనివారికి మాత్రం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారన్న అపవాదువేసి దూరంగా విసిరేస్తున్నారు. సోమవారం జాబితాలు బయటకు వస్తే అసలు రంగు ఏమిటో తెలుస్తుంది.

గడువు పొడిగింపుతో గందరగోళం...

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే బదిలీలకు తెర తీసినప్పటికీ మూడుసార్లు గడువు పొడిగించింది. తొలుత ఆగస్టు 31, తరువాత సెప్టెంబర్ 15, ఆ తరువాత ఈ నెల 22కు మారింది. ఇది ఉద్యోగవర్గాల్లో ఆందోళనకు దారితీసింది. సోమవారం నాటికై నా ఒక కొలిక్కి వస్తుందో లేదోననే సందేహాలు ఉన్నాయి.

పలుకుబడి ఉన్నవారికి వారు కోరుకున్న ప్రదేశానికి బదిలీ అవుతోంది. సామాన్య ఉద్యోగులకు న్యాయం జరగడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. వారు ఏళ్ల తరబడి కుటుంబానికి దూరంగా ఎక్కడో పనిచేస్తున్నా వారి గురించి పట్టించుకునేవారే కనిపించట్లేదు.



- అమ్మానాన్నలను కోల్పోయిన చిన్నారులు
- భవిష్యత్ అంధకారమయం
- దాతల సాయం కోరుతున్న సరస్వతీపుత్రులు
- అండగా నిలిచిన కోడూరు అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, గ్రామస్తులు

తల్లిదండ్రులు దూరం.. భవిత భారం

బాడంగి: రెక్కాడితే గాని డొక్కాడని పేదరికం. ఇల్లు తప్ప సెంటు భూమి లేదు. అలాంటి కుటుంబంపై దయలేని విధి పగబట్టింది. తల్లిదండ్రులను దూరం చూసి నలుగురు పిల్లలను వీధిపాలు చేసింది. నిన్నటి వరకు అన్నం పెట్టిన అమ్మ, నీడై పెంచిన నాన్న ఇద్దరూ ఇప్పుడు లేరు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఆ నలుగురు పిల్లలు దాతల సాయం కోరుతున్నారు. రేపటిపై ఆశ కోసం.. మనసున్న వారి చేయూతను ఆశిస్తున్నారు.

విజయనగరం జిల్లా బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన ఇప్పిలి సత్యం, ఈశ్వరమ్మ దంపతులకు నలుగురు పిల్లలు. పెద్ద బ్బాయి ఇప్పిలి చిన్న కూలి పనులు చేస్తున్నాడు. పెద్దమ్మాయి పులి చిన్నారి ఇంటర్, చిన్నమ్మాయి నందిని పదో తరగతి బాడంగిలోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్నారు. చిన్న అబ్బాయి అప్పలనాయుడు కోడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కొన్నాళ్ల కిందట తండ్రి ఇప్పిలి సత్యం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి ఈశ్వరమ్మ పిల్లలను సాకుతోంది. కూలిపనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని రెక్కలముక్కలు చేసుకుని శ్రమిస్తోంది. ఈ క్రమంలో అనారోగ్యం పాలైన ఆమె ఈనెల 11వ తేదీన మృతి చెందింది. దీంతో ఆ చిన్నారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ చదువులు సాగేదెలాగో తెలియక భయపడుతున్నారు. తమని అదుకునే మానవతా వాదుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

అండగా నిలిచిన 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్'

ఇప్పటికే గ్రామంలో ఎన్నో సహాయ కార్యక్రమాలు చేస్తున్న 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు, గ్రామస్తులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు రూ.60 వేలు, గ్రామస్తులు రూ.70 వేలు అందించి ఆదుకున్నారు.



తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నగదు అందజేస్తున్న 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు

సాయం చేయండి

మా చదువులు ఎలా సాగుతాయో. మా జీవితం ఎలా ముందుకు పోతుందోనని ఆందోళనగా ఉంది. దాతలు ఆదుకుంటారని ఆశిస్తున్నాం. సాయం చేయాలనుకునే వారు 87904 51434 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నాం.

– తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు

వైద్యులకు ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ తప్పనిసరి

- సదరం పరికరాలు అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: వైద్యులు ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నేషన్ సిస్టం)లో అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధి సమావేశాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలసి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ కోసం ఆస్పత్రికి చాలా దూరం నుండి వచ్చే రోగులకు వీలైతే భోజనం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక నుంచి సదరం సర్టిఫికెట్ జారీగాని, సదరం వెబ్ సైట్ స్లాట్స్ బుక్ చేసుకొనే చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన రోగులను పరీక్షించేందుకు అవసరం అయినటువంటి పరికరాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు తాగు నీరు కొరత లేకుండా ఆస్పత్రిలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లను మెయింటినెన్స్ చేయాలన్నారు. జనన, మరణ సర్టిఫికెట్ల జారీ విషయంలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఆస్పత్రిలో డయాగ్నొస్టిక్స్ సరీ్వసులన్నీ పని చేసే విధంగా చూసుకోవాలన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో అన్ని యూనిట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులతో వారానికి ఒక్కసారి మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వనరులతోనే మంచి సేవలు అందించాలన్నారు. రోగికి పెద్ద సమస్య అయితే తప్ప, చిన్న చిన్న సమస్యలకు వేరే ఆస్పత్రికి రిఫర్ చేయకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ఆస్పత్రి చుట్టూ పరిశుభ్రంగా ఉండాలన్నారు. డ్రైనేజీ, శానిటైజేషన్‌లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. మహా ప్రస్థానం వాహనం ఈ వారంలో ఆస్పత్రిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. హాట్ వాటర్ గర్భిణులకు చాలా అవసరం కనుక హాట్ వాటర్ ప్లాంట్స్ పనిచేసే విధంగా ఉండాలన్నారు. డాక్టర్స్ అందరూ అందుబాటులో ఉండాలన్నారు. వైద్యులు ఆస్పత్రి దగ్గరిలో ఉండే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, పురపాలక సంఘం కమిషనర్ కె.శ్రీనివాస్, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్:

వైద్యారోగ్య శాఖ నిబంధనలను ప్రైవేటు ఆస్పత్రులు కచ్చితంగా అమలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన డీపీఎంఓ డా.రఘుకుమార్, వైద్య బృందంతో కలిసి పట్టణంలో శుభం డయాబెటిక్ - స్పెషాలిటీ కేర్, శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ డెంటల్ కేర్ ఆస్పత్రులను శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ తేదీలు, అర్హత ధ్రువ పత్రాలు సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో ఉండాల్సిన వైద్య పరికరాలు, పరీక్ష కిట్లు నాణ్యత, పనితీరు పరిశీలించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ఉపయోగించిన సూదులు, సెలైన్, కాటన్ తదితర వ్యర్థాలను నిర్దేశించిన మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిర్వహణ, రోగుల టాయిలెట్ల శుభ్రత నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. శుభం స్పెషాలిటీ కేర్‌లో వైద్య పరీక్షల ఫీజు వివరాల లిస్టును ప్రదర్శించకపోవడం, నిర్దేశించిన బోర్డు, ల్యాబ్‌కు సంబంధించిన కొన్ని ధ్రువపత్రాల వివరాలపై ఆరా తీసి నిర్ణీత గడువులో పునరుద్ధరించాలని ఆదేశించారు. రోగుల ఆరోగ్య తనిఖీల, వైద్య పరీక్షల వివరాలు రికార్డులో స్పష్టంగా ఉండాలన్నారు. ఆరోగ్య సూచనలు, సలహాలు తెలియజేసే వాల్‌పోస్టర్లు ఉండాలన్నారు. వారి వెంట డెమో యోగేశ్వరరెడ్డి, ఈఓ సత్తిబాబు తదితరులు ఉన్నారు.



ప్రైవేటు ల్యాబ్‌లలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు

వివాహిత అనుమానాస్పద మృతి

సాలూరు రూరల్: మండలం కరాసువలస గ్రామానికి చెందిన ఇల్లుపు దొర కరాసమ్మ (39) శుక్రవారం రాత్రి తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్టు రూరల్ ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు. ఆమె తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఆమె బొడ్డుదొర శ్రీనుని ప్రేమించి పెళ్లి చేసుకుంది. కొంతకాలంగా భర్త తాగి వచ్చి కొడుతుంటాడని ఆ విధంగానే ఆమె మృతిపై అనుమానం ఉన్నట్టు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఏకలవ్యలో చదువులెలా!



కలెక్టర్‌ను చుట్టుముట్టి గోడువినిపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- కలెక్టర్ వద్ద తల్లిదండ్రుల ఆవేదన

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్: ''సమయానికి భోజనం పెట్టరు.. పడుకోవడం, తినడం అక్కడే.. పాఠాలు వినేదీ అక్కడే! టీచర్లు చెప్పేది మా పిల్లలకు అర్థం కాదు.. పిల్లలు చెప్పేది వారికి బోధపడదు.. మార్కులు చూస్తే ఒకటి, రెండే. మరుగుదొడ్లకు వెళ్తే నీళ్లు ఉండవు.. ఇన్ని అవస్థలు నడుమ పిల్లలు ఎలా చదవగలరు.. మేమెలా చదివించగలం..'' అంటూ ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. 'సార్.. మీరు బాధ్యతలు స్వీకరించగానే పాఠశాలకు వచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మీరు తలుచుకుంటే ఎంతసేపు?' అంటూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పలు ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు కలెక్టరేట్‌కు శనివారం చేరుకున్నారు. కలెక్టర్‌ను చుట్టుముట్టి.. సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రధానంగా కురుపాం ఏకలవ్య పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల తీరుతో పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారంతా వివరించారు. చదువులు సక్రమంగా సాగడం లేదని.. భోజన సదుపాయాలు కూడా సరిగ్గా లేవని వాపోయారు. మెనూ అమలు చేయడం లేదని.. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భోజనం పెడుతున్నారని.. విద్యార్థుల కంటే టీచర్లే త్వరగా భోజనం చేస్తున్నారని తెలిపారు. తరగతులు, స్టడీ అవర్లు సక్రమంగా నిర్వహించడం లేదని చెప్పారు. దీంతోపాటు సొంత భవనం లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. చాలీచాలని గదులతో అవస్థలు పడుతున్నారని వివరించారు. ఉపాధ్యాయుల్లో హిందీ వారే ఉండటంతో.. బోధించేది పిల్లలకు అర్థం కావడం లేదని తెలిపారు. దీనివల్ల చాలామందికి సున్నా మార్కులు వస్తున్నాయని వాపోయారు.

గిరిజన విద్యార్థులకు అవస్థలు కలిగించొద్దు

గిరిజన విద్యార్థులను అవస్థలకు గురి చేయడం భావ్యం కాదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల తీరుతో పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా కురుపాం పాఠశాలలో సౌకర్యాలు లేవని.. కనీసం ఫ్యాన్లు కూడా తిరగడం లేదని వివరించారు.

పరిష్కరిస్తాం.. సమయం పడుతుంది : కలెక్టర్

దీనిపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందిస్తూ.. పాఠశాలను మరోచోటకు మారుస్తామని, కాస్త సమయం పడుతుందని చెప్పారు. హిందీ ఉపాధ్యాయులకు తెలుగు వచ్చేందుకు కూడా కొంత సమయం పడుతుందన్నారు. అంతవరకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సాయంత్రం వేళ తెలుగు ఉపాధ్యాయుడిని నియమిస్తామని చెప్పారు. వెంటనే ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఈఎంఆర్ఎస్‌ను తనిఖీ చేసిన పీఓ



పాఠశాలలో అందుతున్న సేవలను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదులు, విద్యార్థుల డార్మెటరీలు, తరగతి గదులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో శుభ్రతపై ఆరా తీశారు. ఆహార పదార్థాలు కింద వినియోగిస్తున్న కాయగూరల నాణ్యత పట్ల ఆయన ప్రశ్నించారు. విద్యార్థులకు పోషక ఆహారాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు విద్యా ప్రమాణాలు పక్కాగా ఉండాలని, జాతీయ స్థాయి పోటీల్లో వారు విజయం సాధించే విధంగా విద్యాభ్యాసన కొనసాగాలని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఉపాధ్యాయులు స్థానిక భాషను నేర్చుకోవాలని తద్వారా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎక్కడ చెత్త ఉండరాదని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య అంశాల పట్ల అవగాహన కల్పించాలని మంచి అలవాట్లు నేర్పాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గ్రహించి వారికి తగిన తర్ఫీదు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన అర్జీలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించి వాటిని పరిష్కరిస్తామన్నారు. పాఠశాల నిర్వహణలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.